క్లుప్తంగా

వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కృష్ణారెడ్డి

మీర్‌పేట: పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ప్రశంసించారు. మీర్‌పేట కార్పొరేషన్ 45వ డివిజన్‌లో నక్షత్ర ఆస్పత్రి సహకారంతో స్థానిక కార్పొరేటర్ అక్కి మాధవి ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మీర్‌పేట అధ్యక్షుడు సామిడి గోపాల్‌రెడ్డి, కీసర యాదిరెడ్డి, వైద్యులు త్రిష, తులసి, శ్రీవల్లి, సీతఊట శివచంద్రప్రకాశ్ పాల్గొన్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన



సదస్సులో పాల్గొన్న రైతులు, ఎరువుల కంపెనీ ప్రతినిధులు, అధికారులు

మహేశ్వరం: మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో కిసాన్ దివాస్ సందర్భంగా రైతులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పురుగుల మందులు పిచికారి చేసే సమయంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రతలపై వివరించారు. ఎరువులు, పురుగుల మందుల వాడకంపై కోరమండల్ ఎరువుల కంపెనీ ప్రతినిధులు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోరమండల్ ఎరువుల కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సతీశ్, సీనియర్ జోనల్ మేనేజర్ రమేశ్ బాబు, సీనియర్ టెరిటరీ మేనేజర్ సురేంద్రబాబు, మండల వ్యవసాయాధికారి నాగమణి, ఏఈఓలు, కంపెనీ సిబ్బంది శివకుమార్ రెడ్డి, ప్రవీణ్, శ్రీనివాస్, ఫర్టిలైజర్ల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

'మౌంట్ కార్మెల్'లో క్రీడా పోటీలు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని మౌంట్ కార్మెల్ గ్లోబల్ స్కూల్‌లో వార్షిక క్రీడా పోటీలను శనివారం నిర్వహించారు. ఆటల పోటీల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొన్నారు. యోగాసనాలతో పాటు నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వంశీ దగ్గుబాటి, అరవింద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుప్రభ హనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవీన్‌కు సన్మానం



నవీన్‌ను సన్మానిస్తున్న నందునాయక్

హుడాకాంప్లెక్స్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఎస్ఐగా ఎంపికైన నవీన్‌ను శనివారం నందు అకాడమీ చైర్మన్ నందులాల్ నాయక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నందులాల్ మాట్లాడుతూ అకాడమీలో శిక్షణ తీసుకున్న అభ్యర్థులు తెలంగాణలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో కూడా అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు. లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగాలు సాధించాలంటే చదువుతో పాటు శిక్షణ కూడా అవసరమని పేర్కొన్నారు.

పంటల సాగుపై అవగాహన

ఇబ్రహీంపట్నం రూరల్: దేశానికి అన్నం పెట్టే అన్నదాత చేసే పనులపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని పోల్కంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో రైతు దినోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. పంటలు సాగు చేసే విధానంపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కృష్ణ, ఎల్.కిరణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వారం.. తరించిన భక్త జనం

గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ధనుర్మాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశి నాడు మూడు కోట్ల దేవతలు భూలోకం వచ్చి మహా విష్ణువును పూజిస్తారని పురాణాలు చెబుతున్నాయి. అందువల్ల తెల్లవారుజామున 4 గంటలకు స్వామి వారికి అభిషేకం, అర్చన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయ కమిటీలు వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశాయి.



మహేశ్వరం: వేంకటేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే సబితారెడ్డిని సన్మానిస్తున్న పాలక మండలి సభ్యులు



మహేశ్వరం: ముక్కోటి ఏకాదశి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



అమీర్‌పేట్‌లోని వేంకటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కందుకూరు: పూజల్లో పాల్గొన్న గురూజీ అనిల్‌కుమార్ జోషి తదితరులు



పహాడీషరీఫ్: పూజల్లో పాల్గొన్న నాయకులు



పహాడీషరీఫ్: తీర్థప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు



పహాడీషరీఫ్: పూజలు చేస్తున్న మహిళలు



మీర్‌పేట: జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



మీర్‌పేట: పూజల్లో పాల్గొన్న ఆలయ ఈఓ, కార్పొరేటర్, మాజీ ధర్మకర్తలు



మీర్‌పేట: ప్రత్యేక అలంకరణలో స్వామివారు

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- ఇబ్రహీంపట్నం సివిల్ సీనియర్ జడ్జి శ్రీదేవి
- లోక్ అదాలత్‌లో 1897 కేసులు రాజీ

ఇబ్రహీంపట్నం రూరల్: దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరిగే కక్షిదారులకు లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని ఇబ్రహీంపట్నం సివిల్ సీనియర్ జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా జడ్జి శ్రీదేవి, సివిల్ జూనియర్ జడ్జి జస్వంత్ సింగ్, మహేశ్వరం జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. నిరంతరం కోర్టులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగకుండా కక్షిదారుల్లో మార్పురావాలని తెలిపారు. సమస్యలను సృష్టించుకొని చిక్కుల్లో పడొద్దని చెప్పారు. కోర్టులను, చట్టాలను గౌరవించి వాటి పరిధిలో ఉండాలని, ప్రజాస్వామ్యానికి హాని చేయకూడదని వివరించారు. భారత రాజ్యాంగంపై అవగాహన కల్గి ఉండాలని సూచించారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. గొడవలు పడి పోలీస్ స్టేషన్లకు రావొద్దని సూచించారు. శాంతి భద్రతల కోసం పోలీసులు, కోర్టులు ఉన్నాయన్నారు. లోక్ అదాలత్‌లో 1897 కేసులు పరిష్కారమయ్యాయి. ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో 171, మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలో 657, యాచారం పీఎస్ పరిధిలో 220, ఇబ్రహీంపట్నం పీఎస్ పరిధిలో 800, గ్రీన్‌ఫార్మా పరిధిలో 49 పిట్టి కేసులు పరిష్కరించామని వెల్లడించారు. మరో 39 ఐపీసీ కేసులు కూడా పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ కె ఎస్ రావు, ఇబ్రహీంపట్నం డివిజన్ సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

నర్సరీ ఏర్పాటుకు స్థల పరిశీలన

మాడ్గుల: మండలంలోని అవురుపల్లి గ్రామ పంచాయతీలో శనివారం ఎంపీడీఓ రాఘువులు పర్యటించారు. గ్రామంలోని నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలను పెంచాలని సూచించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

పలు పాఠశాలల్లో సెమీ కిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. నాదర్‌గుల్ అక్షర స్కూల్‌లో క్రీస్తు జననాన్ని నాటక రూపంలో వివరించారు. శివనారాయణపురం లార్డ్స్ స్కూల్, బడంగ్‌పేటలోని లార్డ్స్ స్కూల్‌లో ముందస్తు కిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు పుట్టిన కథ, క్రిస్మస్ తాత వేషధారణ, పాక నమూనాలను ఏర్పాటు చేశారు.



నాదర్‌గుల్ అక్షర స్కూల్‌లో క్రీస్తు జననాన్ని నాటక రూపంలో వివరిస్తున్న విద్యార్థులు



శివనారాయణపురం లార్డ్స్ స్కూల్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పార్లమెంటు సభ్యుల సస్పెన్షన్ ఎత్తివేయాలి



నందనవనంలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

హస్తినాపురం: పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై నిలదీసిన సభ్యులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ఎల్‌బీ నగర్ సర్కిల్ సీపీఎం కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ప్రశ్నించారు. శనివారం ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం నందనవనం కాలనీలో ఎంపీల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగడుతుంటే లోక్‌సభ, రాజ్యసభలో 146 మంది పార్లమెంటు సభ్యులను సస్పెండ్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పార్లమెంటు భద్రతపై సభ్యులు ప్రశ్నిస్తే వారిని సస్పెండ్ చేయడం సరికాదని, వెంటనే సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీపీఎం సభ్యులు కీసర నర్సిరెడ్డి, ఎండి కమర్, ఆర్.పాండు, బి.దుర్గారావు, పురుషోత్తంచారి, శ్రీనుయాదవ్, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

'మహాలక్ష్మి' పథకాన్ని సవరించాలి

ఇబ్రహీంపట్నం రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని సవరించాలని ధర్మసమాజ్ పార్టీ ఇబ్రహీంపట్నం మండల కమిటీ డిమాండ్ చేసింది. శనివారం తహసీల్దార్ అన్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సుల్లో తెల్లరేషన్ కార్డు కల్గిన వారికే అవకాశం కల్పించాలన్నారు. ఇంటిని పోషించే పురుషులకు ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.3వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రవీందర్, భవాని శేఖర్, రాజు, సురేందర్, బాబురావు, శ్రీకాంత్, చక్రపాణి, నాగార్జున పాల్గొన్నారు.



శ్రీచైతన్యలో వైభవంగా జాతీయ గణిత దినోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శ్రీ చైతన్య గాయత్రి నగర్ బ్రాంచ్ లో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల గణిత ప్రాజెక్టులను అద్భుతంగా రూపొందించి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏజీఎం సతీష్ మాట్లాడుతూ, విద్యార్థులు నిత్యజీవితంలో ఉపయోగపడే వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారని, వీటివల్ల వారిలో సృజనాత్మకత నైపుణ్యం పెరుగుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఫణి మాధవి మాట్లాడుతూ, విద్యార్థులు గణిత ప్రాజెక్టులను చాలా అద్భుతంగా తయారు చేశారని, అవి వారి భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవీందర్, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘువంశి, గాయత్రి నగర్ డీన్ వెంకట్, ఏఓ భాస్కర్, ప్రైమరీ ఇన్‌చార్జి హాతియా, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ శరత్, గాయత్రి నగర్ గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎమినెంట్ క్రిస్టియన్' అవార్డు అందుకున్న ఇషాకర్

హయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే ఎమినెంట్ క్రిస్టియన్ (ప్రముఖ క్రైస్తవుడు) అవార్డును హయత్‌నగర్ షెకీనా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇషాకర్ అందుకున్నాడు. శుక్రవారం రాత్రి నగరంలోని ఎల్‌బీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందజేశారు. షెకీనా ఫౌండేషన్ ద్వారా మూడు దశాబ్దాలుగా దివ్యాంగులకు సేవలు అందించడంతో పాటు క్రైస్తవ సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డు తనకు అందించిందని ఇషాకర్ తెలిపారు. ఈ పురస్కారం తనకు మరింత ఉత్సాహాన్ని ఇవ్వడంతో పాటు బాధ్యతలను కూడా పెంచిందన్నారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి పొన్నం ప్రబాకర్, డీజీపీ రవి గుప్తా తదితరులు ఉన్నారు.

రాష్ట్రపతిని కలిసిన లోటస్ ల్యాప్ విద్యార్థులు



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో లోటస్ ల్యాప్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు

వనస్థలిపురం: శీతాకాల విడిదిలో భాగంగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేసిన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును లోటస్ ల్యాప్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు కలుసుకున్నారు. రాష్ట్రపతికి జ్ఞాపిక అందజేసి పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. లోటస్ ల్యాప్ విద్యాసంస్థల రజతోత్సవం వేళ భారత ప్రథమ పౌరురాలు రాష్ట్రపతిని తమ విద్యార్థులు కలవడం గర్వకారణమని విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రపతిని కలుసుకోవడం తమకు జీవితంలో మరచిపోలేని రోజుగా మిగిలిపోతుందని విద్యార్థులు అన్నారు. కార్యక్రమంలో వనస్థలిపురం, తుర్కయాంజాల్, కమలానగర్, హయత్‌నగర్ బ్రాంచీల విద్యార్థులు శివరామకృష్ణ, నిహారిక, ఆరాధ్య, సహస్ర, మేఘ సంజన, మణికంఠ, లాహిత్య, కార్తీక, వర్ధిని, లావణ్య, కార్తీకరెడ్డి, అక్షర, హర్ష, వీరేంద్ర, అదితి పాల్గొన్నారు.

భూములపై రుణాలివ్వండి

తుర్కయంజాల్: ప్రభుత్వం హక్కు పత్రాలు అందజేసిన భూములపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇప్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చిరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్‌లు శనివారం డీసీసీబీ చైర్మన్ సత్తయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ప్రభుత్వం హక్కులు కల్పించిన భూములపై గడిచిన 13 సంవత్సరాలుగా ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. గతంలో ప్రభుత్వాలు నిరుపేద కుటుంబాలకు, ఆ భూములపై హక్కు పత్రాలు ఇచ్చారు. కావునా, వాటిని పరిశీలనలోకి తీసుకుని రుణాలు మంజూరు చేయాలని కోరారు. రుణాలు ఇవ్వకపోవడం రైతులు అప్పులు చేయాల్సి వస్తుందని తెలిపారు.

కంపు.. కంపు!

పట్టణంలో చెరువులు మురికికూపాలుగా మారుతున్నాయి. చెరువుల్లో కలుషిత నీరు కలవకుండా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు స్థానిక ప్రజలకు తాగు, సాగు నీరు అందించిన చెరువుల్లోని నీరు.. నేడు పూజకు పనికిరాని పువ్వుల్లా మారాయి. నీటి వనరులు, వరద కాల్వల అభివృద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న ప్రకటనలు ప్రచారానికే పరిమితమవుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని పులిందర్ వాగు.. మరమ్మతుకు నోచుకోక వరద ప్రవాహం సాఫీగా సాగడం లేదు. దీనికి తోడు గుర్రపు డెక్క వల్ల దుర్వాసన వెదజల్లుతోంది.

- మరమ్మతులకు నోచుకోని పులిందర్ వాగు
- పరుచుకున్న గుర్రపుడెక్క
- ప్రక్షాళన ఎప్పుడో..?
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



పులిందర్ వాగులో పేరుకుపోయిన గుర్రపు డెక్క

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని బాగ్ మంఖాల్ చెరువు నుంచి వరద నీరు మంఖాల్, తుక్కుగూడ గ్రామాల మీదుగా పులిందర్ వాగు ద్వారా రావిర్యాల పెద్ద చెరువులో కలుస్తుంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా మంఖాల్, తుక్కుగూడ, సర్దార్‌నగర్ గ్రామాల డ్రైనేజీ నీటితో పాటు మంఖాల్ పారిశ్రామిక వాడ నుంచి వచ్చే కలుషిత నీరు నేరుగా రావిర్యాల చెరువులో కలుస్తోంది. గుర్రపు డెక్కతో పాటు పరిసరప్రాంతాల నుంచి వచ్చే కలుషిత నీటితో వాగు నుంచి దుర్వాసన వెలువడుతోంది. మురుగు కారణంగా దోమల వ్యాప్తి కూడా పెరిగింది. దీంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు.

సంరక్షణ చర్యలేవి?

వాగులో గుర్రపు డెక్క, జనుము తొలగించేందుకు నీటిపారుదల శాఖ, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడం లేదు. వ్యర్థాలు, గుర్రపు డెక్కతో వాగు మూసుకుపోవడంతో నీటి ప్రవాహం సాఫీగా సాగడం లేదు. వాగు పొంగి రోడ్లపై, పొలాల్లోకి ప్రవహిస్తోంది. కలుషిత నీటితో అటు రైతులు, ఇటు స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.